

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

కడ్తాల్, నవంబర్ 25 : మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామం నుంచి చరికొండ గ్రామం వరకు బీటీ రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతూ, సోమవారం ముద్విన్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కర్కల్‌పహాడ్ గ్రామం నుంచి ఏక్వాయిపల్లి, ముద్విన్ గ్రామాల మీదుగా చరికొండ గ్రామం వరకు 14 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతు పనులకు రూ.2.91 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కర్కల్‌పహాడ్ నుంచి ఏక్వాయిపల్లి గ్రామం వరకే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఏక్వాయిపల్లి నుంచి చరికొండ గ్రామం వరకు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు గోపాల్, వెంకటేశ్, శ్రీను, జంగయ్య, సతీశ్, వెంకట్‌రెడ్డి, శంకరయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తాతో కలిసి ఆయన ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవయాధికారి నిశాంత్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 25 : రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించి మద్దతు ధరను పొందాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో రఘునందన్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు షాద్‌నగర్ మార్కెట్ యార్డుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలన్నారు. సన్న వడ్లపై క్వింటాలుపై ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు.

మంత్రముగ్ధులను చేసిన చిన్నారుల నాటక ప్రదర్శన

'మాకు స్వాతంత్ర్యం కావాలి' నాటక ప్రదర్శనలో చిన్నారులు

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 25 : హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంతన్ విశ్వకళ ప్రదర్శనలో భాగంగా షాద్‌నగర్ సంస్కార భారతి జాతీయ సంస్కృతిక సంస్థ విభాగం తరపున చిన్నారులు చేసిన నాటక ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసినట్లు సోమవారం మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ సభ్యుడు టీవీ రంగయ్య తెలిపారు. చిన్నారులు 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. చిన్నారులు వర్షిణి, వైష్ణవి, వేదశ్రీ, స్వచిత్ర, యశ్విత, జోషిలను అభినందించి బహుమతులను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిలర్ కృష్ణారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 25 : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చైర్‌పర్సన్ జయశ్రీ అన్నారు. సోమవారం పెద్దఅంబర్‌పేటలోని 7వ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కౌన్సిలర్ కృష్ణారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. ప్రాధాన్యం ప్రకారం అన్ని కాలనీల్లో సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. పనులు సకాలంలో పూర్తిచేసి, త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ శివానందం, కౌన్సిలర్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య

కడ్తాల్, నవంబర్ 25 : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను హమాలీ నాయకులతో కలిసి పెంటయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.25వేలు, పెన్షన్ రూ.10వేలు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా రైతులకు, కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైందని తెలిపారు. ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

పల్గుట్ట గ్రామంలో ఉద్యాన పంటలపై అవగాహన కల్పిస్తున్న కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థులు

చేవెళ్ల రూరల్, నవంబర్ 25 : చేవెళ్ల మండల పరిధి పల్గుట్ట గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన కళాశాల విద్యార్థులు లిల్లీ పంటకు తెగుళ్లు సోకకుండా నివారణ, సస్యరక్షణ చర్యలపై వివరించారు. లిల్లీ పంటకు అధిక వర్షపాతం, నీటి నిలువతో అగ్గి తెగుళ్లు సోకుతుందని, తెగుళ్ల నివారణకు స్పైరోమైసిఫెన్ ఒక మిల్లీలీటర్ నీటిలో కలిపి పంటకు పిచికారీ చేస్తే నివారించవచ్చన్నారు. రైతులు పంటపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విఠలేశ్వర్‌జీ, గ్రామపంచాయతీ సెక్రటరీ రాధ పాల్గొన్నారు.

ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా భవాని, ఎంఈవోగా పునీత్ జశ్విత వ్యవహరించారు. జీవితంలో ఇలాంటి అనుభవాలు వెలకట్టలేనివని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు. - ఆదిబట్ల, నవంబర్ 25

సెంట్రింగ్ బాక్సులు చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్ట్

పరారీలో మరో 10 మంది

వివరాలు వెల్లడిస్తున్న సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సైలు

చేవెళ్ల రూరల్/చేవెళ్ల టౌన్, నవంబర్ 25 : సెంట్రింగ్ బాక్సులు, జాకీ రాడ్స్ దొంగతనం చేస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాను చేవెళ్ల పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం చేవెళ్ల పీఎస్‌లో సీఐ భూపాల్ శ్రీధర్, డిటెక్టివ్ సీఐ రమేశ్‌నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ముషీరాబాద్ పరిధి గోలక్‌పూర్‌లోని గుల్షన్ నగర్‌కు చెందిన మోసిన్ అహ్మద్ స్క్రాప్ (చెత్త) వ్యాపారం చేస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 17 మంది లేబర్లతో ముఠా ఏర్పాటు చేసి వారికి వెహికల్ (టాటా ఏస్) కూడా సమకూర్చాడు. వీళ్లు ఉదయం పూట నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో సెంట్రింగ్ బాక్సులు, జాకీలు, రాడ్స్ దొంగిలించి మోసిన్ అహ్మద్‌కు అప్పజెప్పేవాళ్లు, ఇందుకు వారికి ఆయన డబ్బులు ఇచ్చేవాడు. ఇలా సంగారెడ్డి, మేడ్చల్ రంగారెడ్డి జిల్లాల్లోనూ దొంగతనాలు చేశారు. గత ఆరేడు నెలల్లోనే వీరిపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో 6 కేసులు, మొయినాబాద్ పీఎస్‌లో 3, శంకర్‌పల్లిలో 1, మోకిల పీఎస్‌లో ఒక కేసు నమోదైంది. దీంతో వీరిపై నిఘా పెట్టిన పోలీసులు ఈ నెల 9న చేవెళ్ల మండలం ముడిమ్యాల గేట్ వద్ద నిర్మాణంలో ఉన్న భవన యజమానులు రిజ్వాన్, అహ్మద్ కలిసి నిందితులను పట్టుకునేందుకు ప్లాన్ వేశారు. ఇందులోభాగంగా అదేరోజు అక్కడే రెక్కీ నిర్వహించారు.

అనుమానించినట్టుగానే ఏడుగురు నిందితులు మహమ్మద్ రహమాన్, ఆర్బాజ్, ఆయాజ్, షకీల్, గౌస్ అలీ, కలీముద్దీన్, అన్సార్ అలీ, అక్కడికి రాగా.. పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిని పట్టుకునే క్రమంలో ఇద్దరిపై దాడి చేశారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ప్రధాన నిందితుడు మోసిన్ అహ్మద్ పేరు చెప్పడంతో ఆయనను కూడా అరెస్ట్ చేసి 8 మందిని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు మళ్లీ పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించగా.. బాక్సులు ఉంచిన స్థలంతో పాటు మిగతా నిందితుల సమాచారం ఇచ్చారు. దీంతో 11 కేసులకు సంబంధించి 4,566 సెంట్రింగ్ బాక్సులు దొంగతనం చేయగా.. ముషీరాబాద్ ఓపెన్ ప్లేస్‌లో ఉంచిన రూ.25 లక్షల విలువైన 3,732 బాక్సులు స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేశామని, మరో 10 మంది నిందితులు అల్తాఫ్, ఇమ్రాన్, అఖిల్ బాజ్పేయి, బజాల అలీ, అజీజ్ అలీ, అర్వాజ్, రిజ్వాన్, బాసిమ్ ఖాన్. నన్నే, ఖలీద్ పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ కేసుకు సంబంధించిన సంగారెడ్డి, మేడ్చల్ పోలీసులకు ఇప్పటికే సమాచారం ఇచ్చామని, యూపీ పోలీసులకు కూడా సమాచారం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గోదా సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 25 : షాద్‌నగర్‌లోని గోదా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆరాధన, బాలభోగం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురారోపణం, పవిత్రాదివాసం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. పవిత్రోత్సవాలు మూడ్రోజుల పాటు జరుగుతాయన్నారు. పవిత్రోత్సవాల ముగింపు రోజున ఆరాధన, అర్చన, సేవాకాలం, హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రావరోహణ, అష్టోత్తర శత కలశాభిషేకం, శ్రీపుష్పయాగం, నివేదన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పవిత్ర మాలధారణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఐక్యత ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎక్సైజ్ సీఐ బధ్యానాథ్ చౌహాన్



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ బధ్యానాథ్ చౌహాన్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు, నవంబర్ 25 : ఐక్యత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎక్సైజ్ సీఐ బధ్యానాథ్ చౌహాన్ అన్నారు. ఆమనగల్లులో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం చివరి రోజు కార్యక్రమాన్ని ఎక్సైజ్ సీఐ ప్రారంభించారు. సోమవారం వరకు 5000 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 3000 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు, 162 మందిని ఐవోల్ అపరేషన్‌కు ఎంపిక చేయగా.. ఇప్పటికే 86 మందికి కంటి శుక్లాల సర్జరీ పూర్తి చేయడం జరిగిందని, మిగతావారికి మంగళవారం, బుధవారం కంటి శుక్లాల సర్జరీ చేయనున్నట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

రిషి టాలెంట్ పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు అందజేస్తున్న మండల విద్యాధికారి పాండు

రిషి టాలెంట్ పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ

ఆమనగల్లు, నవంబర్ 25 : మండల కేంద్రంలోని రిషి టాలెంట్ పాఠశాల యాజమాన్యానికి మండల విద్యాధికారి పాండు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 11న పాఠశాలల తనిఖీలో భాగంగా రిషి టాలెంట్ పాఠశాలకు వెళ్లగా పాఠశాలలో విద్యార్థులు ఉపయోగించే మూత్రశాల, మరుగుదొడ్లు దుర్గంధంతో ఉండటంతోపాటు కనీసం తలుపులు లేకుండా ఉండటం గమనించిన ఎంఈవో వెంటనే మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రంగా చేయడంతో పాటు వాటికి తలుపులు ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. సోమవారం తనిఖీలో భాగంగా పాఠశాలకు వెళ్లగా మూత్రశాలలు, మరుగుదొడ్లు గతంలో ఉన్న మాదిరిగా ఉండటంతోపాటు పాఠశాల పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా ఉండటంతో పాఠశాల యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాల అనుమతి పొందిన భవనంలో కాకుండా మరో చోట నిబంధనలకు విరుద్ధంగా ప్రైమరీ పాఠశాల నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలోనే హాస్టల్‌ను సైతం నడుపుతున్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని యాజమాన్యానికి షోకాజ్ నోటీసును జారీ చేశారు. సదరు విషయాన్ని జిల్లా విద్యాధికారికి నివేదిస్తామని ఎంఈవో తెలిపారు.

టిప్పర్ ఢీకొని బాలుడు మృతి

షాద్‌నగర్, నవంబర్ 25 : టిప్పర్ ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలిగిద్ద గ్రామానికి చెందిన ఎండీ జమాల్(14) బైక్‌పై రోడ్డు దాటుతుండగా టిప్పర్ వాహనం ఢీకొంది. దీంతో జమాల్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపై వదిలేసి పారిపోయాడు. టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడుపడంవల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాద వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించి జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

సర్వే 95 శాతం పూర్తి

ఎంపీడీవో శ్రీవాణి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 25 : ఈ నెల 9 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కాగా.. ఇప్పటివరకు మండలంలో 95 శాతం పూర్తయిందని ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా, మీరు అందుబాటులో లేకున్నా, మీ ఇంటికి తాళం వేసి ఉన్నా సందర్భాల్లో సర్వేలో నమోదుకాని కుటుంబాలవారు 100 శాతం నమోదు కోసం అందరూ సహకరించాలన్నారు. సర్వేలో మిగిలి ఉన్న కుటుంబాలు సంబంధిత పంచాయతీ కార్యదర్శిని లేదా మండల అభివృద్ధి అధికారిని సంప్రదించాలని సూచించారు. లేదా 8317679293 ద్వారా మీ కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

భక్తి పరవశం

కార్తిక చివరి సోమవారాన్ని పురస్కరించుకొని శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

షాద్‌నగర్‌టౌన్ : గిరిజామృత లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న కౌన్సిలర్ విశాల, భక్తులు

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 25 : ఫరూఖ్‌నగర్ మండలంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే స్వామివారి దర్శనార్థం భక్తులు క్యూలో వేచి ఉండి స్వామివారికి బిల్వపత్రాలతో అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు కల్పించామని ఆలయ కార్యానిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 25 : షాద్‌నగర్‌లోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలోని గిరిజామృత లింగేశ్వరస్వామికి కౌన్సిలర్ విశాల, భక్తులు విశేష పంచామృతాభిషేకాలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు.

కడ్తాల్, నవంబర్ 25 : మండల కేంద్రంతోపాటు పరిధిలోని ఆయా గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, హారతి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు.

ఆమనగల్లు, నవంబర్ 25 : పట్టణంలోని అభయాంజనేయ భజనమండలి ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, గీతాలాపనలు చేశారు. ఆలయ అర్చకుడు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అభయాంజనేయ భజనమండలి అధ్యక్షుడు నారాయణగౌడ్, గౌరవ అధ్యక్షుడు దామోదరాచారి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి, గాయకులున్నారు.

షాద్‌నగర్‌రూరల్ : రామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్ : అన్నాసీపల్లిలో ప్రత్యేక అలంకరంలో శివలింగం

ఆమనగల్లు : హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అభయాంజనేయ భజనమండలి సభ్యులు

ఘనంగా సహస్ర చండీయాగం

చేవెళ్ల రూరల్, నవంబర్ 25 : చేవెళ్ల మండల పరిధి గొల్లపల్లి అనుబంధ గ్రామం ధర్మసాగర్‌లోని బంగారు మైసమ్మతల్లి ఆలయంలో బీఆర్ఎస్ నాయకుడు, ఆలయ సుందరీకరణకు రూ.15 లక్షలు విరాళం అందించిన దాత కందికొండ విఘ్నేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సహస్ర చండీయాగం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీపాద సమక్షంలో సహస్ర చండీయాగంతోపాటు శిఖర స్థాపన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వర్ణన, జలాదివాసం, ధాన్యాదివాసం, పూర్ణహుతి తదితర కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ సహస్ర చండీయాగం నిర్వహించినట్లు విఘ్నేశ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం

షాబాద్ ఎంపీడీవో అపర్ణ

షాబాద్, నవంబర్ 25 : నేడు ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సప్లిమెంటరీ ఓటరు జాబితాపై మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులతో సమావేశం ఉంటుందని చెప్పారు. సమయపాలన పాటించి హాజరు కావాలన్నారు.

వివరాలు నమోదు చేయించుకోవాలి

ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే మండలంలో 98 శాతం పూర్తయిందని తెలిపారు. సర్వేలో ఇంకా ఎవరైనా వివరాలు ఇవ్వనివారు, నమోదు చేసుకోనివారు ఉంటే వెంటనే వారి గ్రామపంచాయతీల్లో సంప్రదించాలన్నారు. 26వ తేదీతో సర్వే పూర్తవుతుందన్నారు. వివరాల కోసం ఎంపీడీవో షాబాద్ (9949995467)ను సంప్రదించాలన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 25 : షాద్‌నగర్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనపై సమగ్ర కుటుంబ సర్వేను పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండ్రోజుల్లో సర్వే ముగియనున్నదని, ఇప్పటివరకు సర్వే సమయంలో అందుబాటులో లేనివారు తమ వివరాలను చేసుకోవాలన్నారు. సర్వే చేయించుకోనివారు మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రాంచందర్‌రావు(9959909909)ను మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నందిగామ తహసీల్దార్ కార్యాలయం సందర్శన

నందిగామ, నవంబర్ 25 : నందిగామ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందర్శించారు. గత కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతున్నదని, నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం ఎంపిక చేయాలని తహసీల్దార్‌కు సూచించారు.